## కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 4 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో గురువారం రోజున (కేజీ–రూపాయలు) ధరలు కింది విధంగా ఉన్నాయి. టమాట 17, వంకాయ 18, బెండకాయ 40, పచ్చిమిర్చి 55, బజ్జి మిర్చి 35, కాకరకాయ 35, బీరకాయ 28, క్యాబేజి 18, ఫ్రెంచ్ బీన్స్ 45, క్యారెట్ 23, కాలీఫ్లవర్ 18, దొండ 23, చిక్కుడు 50, గోరుచిక్కుడు 28, బీట్‌రూట్ 23, క్యాప్సికం 65, ఆలుగడ్డ 33, కీరా 20, దోసకాయ 18, సోరకాయ 9, పొట్లకాయ(1) 13, కందగడ్డ 65, ఉల్లి పొరక 35, ఉల్లిగడ్డ 22, మామిడికాయ 10 నుంచి 15, అరటికాయ 8 నుంచి 9, చామగడ్డ 35, ముల్లంగి(1) 4 నుంచి 6, మొరంగడ్డ 16, గుమ్మడికాయ 40, నిమ్మకాయలు 55 నుంచి 60, మునగకాయ 5 నుంచి 6గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం


కొండాపూర్, ఏప్రిల్ 4: గుర్తు తెలియని మహిళా మృతదేహం లభ్యమైన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగంపల్లి రైల్వే స్టేషన్ 6వ ప్లాట్‌ఫాం పార్కింగ్ స్థలంలో గుర్తు తెలియని మహిళ(65) మృతదేహం ఉన్నట్లు సమాచారం అందింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. స్థానికంగా భిక్షాటన చేసుకునే మహిళగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## పరామర్శ

కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 4 :రోడ్డు ప్రమాదంలో గాయపడి కూకట్‌పల్లిలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఫతేనగర్ డివిజన్ బీజేపీ నాయకుడు రామ్మోహన్ కుమారుడిని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వర్‌రావు పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు ఉన్నారు.

# ఎంపీగా రేవంత్‌రెడ్డి.. మల్కాజిగిరికి చేసిందేమీలేదు

■ బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 4 : మల్కాజిగిరి ఎంపీగా గెలిచిన రేవంత్‌రెడ్డి ఇక్కడి ప్రజలకు చేసిందేమీలేదని.. కనీసం ఎంపీ నిధులను కూడా తీసుకుని అభివృద్ధి చేసింది లేదని మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం కూకట్‌పల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్‌వన్‌గా అభివృద్ధి చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దని.. పేదలందరికీ సంక్షేమ పథకాలు... కాలనీ, బస్తీలకు అభివృద్ధి ఫలాలు చేరాయన్నారు. మాజీ మంత్రి కేటీఆర్ హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ నగరంగా తీర్చిదిద్దారని, ఐటీ రంగంలో హైదరాబాద్‌కు ప్రపంచ ఖ్యాతిని తీసుకొచ్చారన్నారు. ఉచిత విద్యుత్, ప్రాజెక్టుల నిర్మాణంలో రైతాంగాన్ని ఆదుకున్నారని తెలిపారు. మూడు నెలల్లోనే రాష్ట్రంలో రైతులు నీళ్లులేక ఇబ్బందులు పడుతున్నారని, కాంగ్రెస్ నేతలకు పాలన చేతగాక నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. ఇక్కడ బరిలో నిలిచిన ఈటల రాజేందర్, సునీతా మహేందర్‌రెడ్డిలు స్థానికంగా ఉండరని.. మల్కాజిగిరి ప్రాంత ప్రజల కష్టాలు వారికి తెలియన్నారు. గతంలో ఎంపీగా పనిచేసిన నేటి సీఎం రేవంత్‌రెడ్డి మల్కాజిగిరి అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదన్నారు. మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ గొంతు వినబడాలంటే బీఆర్‌ఎస్‌ను ఆదరించాలని ప్రజలను కోరారు.

# అక్రమంగా నీటిని తరలిస్తే కఠిన చర్యలు

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



కాముని చెరువు పరిసర ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



బోర్లను జేసీబీతో ధ్వంసం చేస్తున్న సిబ్బంది

అల్లాపూర్, ఏప్రిల్ 4: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని కాముని చెరువు పరిసర ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా బోర్లు వేసి అపరిశుభ్రమైన నీటిని తరలిస్తూ ప్రజల ప్రాణాలతో చలగాటం ఆడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. నీటి ఎద్దడితో సఫ్థర్‌నగర్ ప్రజలు పడుతున్న ఇబ్బందులను బుధవారం ఎమ్మెల్యే స్వయంగా వీధివీధి తిరుగుతూ.. నిబంధనలకు విరుద్ధంగా వేసిన బోర్లను పరిశీలించి అక్రమాలకు అడ్డుకట్ట వేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ మేరకు గురువారం కూకట్‌పల్లి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఇరిగేషన్ ఏఈ లక్ష్మీనారాయణతో కలిసి ఎమ్మెల్యే కృష్ణారావు పరిశీలించారు. కాముని చెరువులో వాల్టా యాక్ట్‌కు విరుద్ధంగా వెలసిన బోర్లను జేసీబీతో ధ్వంసం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కొందరు అక్రమార్కులు చెరువులు, నాలాలు కబ్జా చేసి బోర్లు వేసి నీటిని విక్రయిస్తూ రూ.కోట్లల్లో వ్యాపారం చేస్తూ సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడమేంటని అధికారుల తీరు పట్ల ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక మీదట ఎవరైనా అక్రమ నీటి దందాకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు.

# సహారా పేరుతో ఆర్థిక దోపిడీ



సమావేశంలో మాట్లాడుతున్న బాధితురాలు పూజిత

ఖైరతాబాద్, ఏప్రిల్ 4: సహారా పేరుతో ఆర్థిక దోపిడీకి పాల్పడి తమను రోడ్డున పడేశారని బాధితురాలు పూజిత వాపోయారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నర్సింగ్, గణేశ్‌తో కలిసి ఆమె మాట్లాడారు. సహారా ఎలాంటి డిపాజిట్లు స్వీకరించవద్దంటూ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా (సెబీ)తో పాటు ఆర్థిక నియంత్రణ సంస్థలు నిషేధం విధించాయని తెలిపారు. అయినా అక్రమంగా అమాయకుల వద్ద డిపాజిట్లు స్వీకరించి వారిని దోచుకుంటున్నారని ఆరోపించారు. నాలుగేండ్లుగా బాధితులమైన తాము చేస్తున్న పోరాటానికి కొంత ఫలితం దక్కిందన్నారు. బుధవారం సహారా సౌత్ జోన్ డైరెక్టర్ రామకోటేశ్వరరావును నగర సీపీ శ్రీనివాస్‌రెడ్డి చొరవతో పోలీసులు అరెస్టు చేయడం పురోగతిని కలిగించిందన్నారు. ఎందరో తల్లిదండ్రులు తమ పిల్లల చదువులు, పెండ్లిల కోసం దాచుకున్న డబ్బులను సహారా దోచుకున్నదన్నారు. ఇప్పటికే ఢిల్లీ కోర్టులో 127 మంది బాధితులు కేసులు వేశారని తెలిపారు. సహారా పేరుతో ఆర్థిక దోపిడీ చేసిన ప్రతిఒక్కరిపై నాన్‌బెయిలబుల్ కేసులు పెట్టాలని, వాటి కార్యాలయాలన్నీ సీజ్ చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

■ ఇఫ్తార్ విందు



రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఆదిత్యానగర్‌లో నిర్వహించిన దవాత్ ఏ ఇఫ్తార్ విందు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ – మాదాపూర్, ఏప్రిల్ 4



హైదరాబాద్ నగరం భిన్న సంస్కృతులకు నిలయమని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. గాజులరామారం డివిజన్ పరిధి, చంద్రగిరినగర్‌లో గురువారం జరిగిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, సీనియర్ బీఆర్‌ఎస్ నాయకులు మక్సూద్‌అలీతోపాటు పలువురు ముస్లిం సోదరులు పాల్గొన్నారు. – దుండిగల్, ఏప్రిల్ 4

■ సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠాపన

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 4: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల 132 డివిజన్ పరిధి బ్యాంకు కాలనీ సాయి సహిత హనుమాన్, శివలింగ దేవాలయంలో నిర్వహించిన సాయి బాబా విగ్రహ ప్రతిష్టాపన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిలతో పాటు పార్టీ శ్రేణులు హాజరై ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు సుధాకర్‌గౌడ్, పార్టీ సీనియర్ నేతలు సంపత్ మాధవరెడ్డి, కుంట సిద్ధి రాములు, దూదిమెట్ల సోమేశ్‌యాదవ్, నరేందర్‌రెడ్డి, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, సమ్మయ్యనేత, కాలే నగేశ్, గణేశ్, ఎల్లాగౌడ్, విజయ్‌హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

# సదరం క్యాంపు దరఖాస్తుల ఆహ్వానం

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 4: సదరం క్యాంపు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో మున్ని గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లాలోని దివ్యంగులు సదరం క్యాంపు కోసం దరఖాస్తులు చేసుకోవడానికి ఈనెల 8న ఉదయం 11 గంటలకు ఆన్‌లైన్ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలని పేర్కొన్నారు. మీ సేవ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారు సూచించిన దవాఖానకు వెళ్లి ఇక్కడి నుంచి డాక్టర్ సర్టిఫికెట్ తీసుకోవాలన్నారు. జిల్లాలోని దివ్యంగులు కొండాపూర్, వనస్థలిపురంలోని దవాఖానల్లో క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఆధార్, రేషన్ కార్డులను తప్పనిసరిగా తీసుకురావాలన్నారు.

■ ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాలు



వేసవిలో చలి వేంద్రాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతాయని హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్‌కుమార్ అన్నారు. గురువారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నల్లగండ్ల చౌరస్తాలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చందానగర్, నల్లగండ్ల, గచ్చిబౌలి తదితర ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానికులు ఘాలి కృష్ణ, విజయేందర్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, మల్లేశ్ యాదవ్, మురళి తదితరులు పాల్గొన్నారు. – శేరిలింగంపల్లి, ఏప్రిల్ 4

# అగ్గిపెట్టె ఉందా అంటూ.. సెల్‌ఫోన్ చోరీ

ఖైరతాబాద్, ఏప్రిల్ 4: అగ్గిపెట్టె ఉందా అంటూ ఓ వ్యక్తి సెల్‌ఫోన్‌ను గుర్తుతెలియని దుండగుడు అపహరించుకెళ్లాడు. ఈ ఘటన పంజాగుట్ట పోలీసు స్టేషన్ పరిధిలోని అమీర్‌పేట కేఎల్‌ఎం షాపింగ్ మాల్ వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని నాచారం పరిధి గోకుల్‌నగర్‌కు చెందిన సుడిగాల సాయికుమార్ క్యాబ్ డ్రైవర్. గురువారం షాపు వద్ద ఉండగా, గుర్తుతెలియని వ్యక్తి వచ్చి అగ్గిపెట్టె అడిగాడు. తన వద్ద లేదంటూ సమాధానం చెబుతుండగానే చేతిలో ఉన్న సెల్‌ఫోన్‌ను తీసుకొని పరుగులు పెట్టాడు. అనంతరం షాపు ఎదురుగా ఆగి ఉన్న ఆటోలో ఎక్కిపారిపోయాడు. వెంటనే కారు తీసుకొని ఆటోను వెంబడించగా అప్పటికే జారుకున్నారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# విద్యుదాఘాతంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



వెంగళరావునగర్, ఏప్రిల్ 4: విద్యుదాఘాతంతో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై శ్రవణ్‌కుమార్ వి వరాల ప్రకారం.. బల్కంపేటలోని ఎస్‌బీఐ బ్యాంకు ముందున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తగిలి బుధవారం రాత్రి ఓ వ్యక్తి ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చా రు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు అపస్మారకస్థితిలో ఉన్న బాధితుడిని 108 ద్వారా గాంధీ దవాఖాన కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే వ్యక్తి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతి చెందిన వ్యక్తి వయసు సుమారు 25 నుంచి 30 సంవత్సరాలు ఉంటుందని, ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# సాయం చేసే గుణాన్ని అలవర్చుకోవాలి



ప్రతి ఒక్కరూ సాయం చేసే గుణాన్ని అలవర్చుకోవాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ సాధిక్ అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ మోహన్‌రావుకాలనీలో బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ సాధిక్ ఆధ్వర్యంలో మహ్మద్ చోటా కరీం సహకారంతో గురువారం 200మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు. – జవహర్‌నగర్, ఏప్రిల్ 4

# భారతీయ జీవన విధానమే విశ్వగురువు



బంజారాహిల్స్, ఏప్రిల్ 4: భారతీయ సంస్కృతికి, జీవన విధానాన్ని, తాత్విక చింతనను ప్రపంచం మొత్తం ప్రత్యేకంగా గుర్తిస్తుంటే మనం మాత్రం పాశ్చాత్య ప్రభావానికి లోను కావడం ఆవేదన కలిగిస్తుందని భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. బంజారాహిల్స్ రోడ్ నం.4లోని కళాకృతి ఆర్ట్ గ్యాలరీలో ప్రముఖ కళాకారుడు ఆర్.గిరిధర్‌గౌడ్ వేసిన మినియేచర్ పెయింటింగ్స్‌తో ఏర్పాటు చేసిన శివ అండ్ శక్తి ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను గురువారం వెంకయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంగీతం, సాహిత్యం, చిత్రలేఖనం, నాట్యకళలు భారతీయ సంస్కృతిలో భాగమని అన్నారు. ఒకప్పుడు భారతదేశం ప్రపంచానికే విశ్వగురువుగా ఉండేదన్నారు. అయితే పాశ్చాత్య పోకడలు పెరిగిపోవడంతో భాషతో పాటు వేషధారణలో మార్పులు వచ్చాయన్నారు. ప్రపంచంలో ఎక్కడ మంచి ఉన్నా స్వీకరించడం తప్పులేదని, అదే క్రమంలో మన మాతృభాషను మర్చిపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో సినీ రచయిత తణికెళ్ల భరణి, అంతర్జాతీయ క్రికెట్ అంపైర్ అనిల్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# వ్యక్తి ఆత్మహత్య

మూసాపేట, ఏప్రిల్4: జీవితంపై విరక్తి చెందిన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... ఖమ్మంకు చెందిన షాజహాన్(30) కూకట్‌పల్లి భగ్యనగర్‌కాలనీ సంధ్య అపార్టుమెంట్‌లో ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం సాయంత్రం అదే ఇంట్లో ఉరేసుకుని కనిపించాడు. పోలీసులు వచ్చి చూడగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించి కేసు నమోదు చేసి శవపరీక్ష కోసం గాంధీకి తరలించారు.

## నీటి సంపులో పడి వ్యక్తి మృతి

మూసాపేట, ఏప్రిల్ 4: ఇంట్లో ఉన్న నీటి సంపులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి రాఘవేంద్రనగర్ సొసైటీకి చెందిన కనకరాజు(25) తన ఇంట్లో సంపులో గురువారం సాయంత్రం శవమై తేలాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని మృతదేహాన్ని వెలికితీశారు. పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు. అనంతరం పోలీసులు మృతుడి తల్లిదండ్రులను విచారించగా.. తన కుమారుడి మృతిపై ఎటువంటి అనుమానం లేదని మృతుడికి ఫిట్స్ వచ్చేవని, నీళ్లు తోడుతుండగా ఫిట్స్ రావడంతో అదే సంపులో పడి మృతి చెంది ఉంటాడని తల్లిదండ్రులు తెలిపారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# పన్ను వసూలు సిబ్బందికి ప్రశంసాపత్రాలు

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 4: ఆస్తిపన్ను వసూళ్లలో అంకితభావంతో పనిచేసిన సిబ్బందిని జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ అభినందించారు. ఈ మేరకు యూసుఫ్‌గూడలో సర్కిల్ సిబ్బందికి జోనల్ కమిషనర్ స్నేహ శబరీశ్‌తో కలిసి ప్రశంసాపత్రాలు అందించారు. జీహెచ్‌ఎంసీ 19వ సర్కిల్‌లో గత ఆర్థిక సంవత్సరం (2023–24)లో ఆస్తి పన్ను వసూళ్ల లక్ష్యం 100 శాతం దాటింది. గతేడాది రూ.33.73 కోట్ల లక్ష్యానికి గానూ రూ.33.75 కోట్ల పన్ను వసూలు చేశారు. వసూళ్లలో చిత్తశుద్ధితో పనిచేసిన బిల్ కలెక్టర్లు సురేందర్, ప్రేమ్‌కుమార్, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు సుమన్, హరినివాస్‌లను అభినందించారు.

# ఉచిత మెగా వైద్య శిబిరానికి స్పందన



మందులు పంపిణీ చేస్తున్న మాజీ సర్పంచ్ కంటం కృష్ణారెడ్డి, వైద్యులు

**శామీర్‌పేట, ఏప్రిల్ 4:** ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అలియాబాద్ మాజీ సర్పంచ్, రైతు బంధు మాజీ మండల అధ్యక్షుడు కంటం కృష్ణారెడ్డి సూచించారు. మెడిసిటీ దవాఖాన ఆధ్వర్యంలో అలియాబాద్ గ్రామ పంచాయతీ వద్ద ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 128 మందికి షుగర్, బీపీ, కంటి, చెవి, ముక్కు, గొంతు, థైరాయిడ్, గర్భసంచి సంబంధించిన సమస్యలు, ఊపిరితిత్తుల సమస్యలకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 54 మందికి వివిధ కారణాల వల్ల దవాఖానకు రిఫర్ చేశారు.

ఈ కార్యక్రమంలో వైద్యులు ప్రవీణ్, వంశీ, కార్తీక్, కీర్తి, మార్కెటింగ్ ఇన్‌చార్జి కుమారస్వామి, నాగార్జున, సత్యనారాయణ, ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన తొలివిడత ఎన్నికల శిక్షణ

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 4: లోక్‌సభ ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులకు నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న తొలి విడత శిక్షణ ముగిసింది. షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో గురువారం అదర్ పోలింగ్ ఆఫీసర్ (ఓపీఓ)ల శిక్షణ నిర్వహించారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 1000 మందికి పైగా అధికారులకు శిక్షణ నిర్వహించినట్టు అధికారులు తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనలు అనుసరించి పోలింగ్ నిర్వహించేందుకు పోలింగ్ ఆఫీసర్స్ (పీఓ), అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్స్ (ఏపీఓ), అదర్ పోలింగ్ ఆఫీసర్స్ (ఓపీఓ)లకు శిక్షణ పూర్తయ్యిందని జూబ్లీహిల్స్ అసెంబ్లీ సెగ్మెంట్ అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ దశరథ్ సింగ్ రాథోడ్ తెలిపారు. లోక్‌సభ ఎన్నికలప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు తొలి విడత శిక్షణ పూర్తికాగా తుది విడత శిక్షణ త్వరలో చేపట్టనున్నట్లు తెలిపారు.

# కుమ్మరి చెరువులో పడి విద్యార్థి మృతి



సందీప్(ఫైల్)

మూసాపేట, ఏప్రిల్ 4: చేపల వేటకు వెళ్లిన ఓ విద్యార్థి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. సీఐ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. బాలజీనగర్ భూషన్ బ్లెసెడ్ హోమ్స్‌కు చెందిన సందీప్(13) మరో ఇద్దరు స్నేహితులతో కలిసి సమీపంలోని కుమ్మరి చెరువుకు చేపల వేటకు వెళ్లారు. చేపలు పట్టే క్రమంలో ప్రమాదవశాత్తు సందీప్ కాలు జారి చెరువులో పడిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు డీఆర్‌ఎఫ్ సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. సందీప్ తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేస్తున్న కార్యదర్శి టీవీ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీలత

# క్రీడలపై విద్యార్థులు దృష్టి సారించాలి

**మేడ్చల్, ఏప్రిల్ 4 :** విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల కార్యదర్శి టీవీ రెడ్డి అన్నారు. కళాశాలలో గురువారం వార్షిక క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసక్తి ఉన్న క్రీడారంగంపై విద్యార్థులు రాణించేందుకు కృషి చేయాలన్నారు. ఆటల ద్వారా కూడా ఉన్నత భవిష్యత్‌ను సొంతం చేసుకునే అవకాశాలు ఉన్నాయన్నారు. అంతేగాకుండా మానసిక, శారీరక ఆరోగ్యం ఆటల ద్వారా చేకూరుతుందని తెలిపారు. ఈ ఏడాది వివిధ క్రీడా అంశాల్లో రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. అనంతరం క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పీజేవీ రత్నకుమార్, అకాడమిక్ డైరెక్టర్ సరోజా రెడ్డి, ఏవో అనురాగ్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీలత, అధ్యాపకులు డాక్టర్ భాస్కర్ రెడ్డి, డీన్ లక్ష్మీదేవి, పీఆర్వో రవిసుధాకర్, హెచ్‌వోడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పాత మెడికల్ రికార్డ్స్‌ను తొలగిస్తాం

ఖైరతాబాద్, ఏప్రిల్ 4: నిమ్స్ దవాఖానలో ఉన్న పాత మెడికల్ రికార్డులను తొలగిస్తున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నిమ్మ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. నిమ్స్‌కు వచ్చే రోగుల మెడికల్ రికార్డ్స్‌ను ఎప్పటికప్పుడూ భద్రపరుస్తామని, అయితే కొన్నేళ్లుగా వేలాది రికార్డులు పేరుకు పోయాయని తెలిపారు. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం ప్రతి పదేండ్లకోసారి పాత రికార్డులను నిర్వీర్యం చేస్తారన్నారు. అదే నేపథ్యంలో 2011 జనవరి 1వరకు ఉన్న రికార్డులను పూర్తిగా తొలగించేందుకు వైద్యుల కమిటీ నిర్ణ యం తీసుకుందని వెల్లడించారు. ఈ కాల వ్యవధిలో ఎవరైనా రోగులు ఆస్పత్రిలో చికిత్స పొందిన రోగుల ఎంఎల్ సీ రికార్డులు, ఇతర కేస్‌షీట్లు కావాలనుకుంటే మెడికల్ సూపరింటెండెంట్ లేదా ఎంఆర్‌డీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## ట్రాఫిక్‌కు అడ్డంకులు.. వ్యాపారులపై కేసులు

బంజారాహిల్స్, ఏప్రిల్ 4: రోడ్డుపై వాహనాల రాకపోకలకు అడ్డంకులు కల్పిస్తూ వ్యాపారాలు ఏర్పాటు చేసిన ఇద్దరు వ్యక్తులపై ఫిలింనగర్ పోలీసులు కేసులు నమోదు చేశారు. షేక్‌పే ట ప్రధాన రహదారిలోని డీమార్ట్ సమీపంలో రంజాన్ సందర్భంగా సయ్యద్ అదిల్ అనే వ్యక్తి 'నూర్ ఏ రంజాన్ ఎక్స్‌పో' పేరుతో షాపు ఏర్పాటు చేశాడు. పార్కిం గ్ సౌకర్యం లేక వాహనదారులు తమ వాహనాలను పుట్‌పాత్‌తో పాటు వాక్ వే మీద పార్క్ చేస్తున్నారు. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని టోలీచౌకి ట్రాఫిక్ ఎస్సై ప్రేమ్‌రాజ్ ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఐపీసీ 283, 341, 336 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మరో ఘటనలో టోలీచౌకిలోని ఎంఎ ఫ్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో ముర్తుజా 'రౌనక్–ఏ–రంజాన్' పేరుతో షాపింగ్ ఎక్స్‌పో ఏర్పాటు చేశారు. పార్కింగ్ సౌకర్యం సరిపోయినంత లేకపోవడంతో కస్టమర్లు రోడ్లపై, పుట్‌పాత్‌లపై పార్కింగ్ చేస్తున్నారు. ఈ మేరకు ట్రాఫిక్ ఎస్సై ప్రేమ్‌రాజ్ ఇచ్చిన ఫిర్యాదుతో నిర్వాహకుడు ముర్తుజా మీద ఐపీసీ 283, 341, 336 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.